# అంతర్యాలు-అనుబంధాలు

**మధురానగరంలో జయంతసేన అభిజాత్య సంపన్నుడైన ఒక శిల్పాచార్యుని కూతురు. ఆమె అందచందాల గురించి కర్ణాకర్ణిగా విని రాజుగారు మోజు పడ్డారు.**

ఆమె నాట్య విద్య నైపుణ్యమును సాకు చేసుకుని ఆమెను రాజనర్తకిని చేస్తామన్నారు. తండ్రీ కూతుళ్ళు నిరాకరించారు. కనీసం కొలువులో తన కళ్ళముందొకసారి గజ్జె కట్టమని కోరుకున్నాడు రాజు.

మీనాక్షిదేవి ఆలయంలో మాత్రమే రాజ సమక్షంలో నాట్యం చేయడానికి ఒప్పుకున్నది జయంతిసేన. వెంట వారి పరివారము వస్తే రావచ్చును కాని ఎవరూ తన కంట పడకూడదని కట్టడి చేసింది.

ఆ సమయంలో స్తంభాలకు కళ్ళు వచ్చినట్టు చూస్తున్నారు మంత్రి, దళవాయి, ఆస్థాన కవి విశాఖదత్తుడూ మొదలైనవారు వాటుగా. ఆమెకు వాళ్ళెవరూ కన్పించ లేదు కాని నాట్యం చేస్తున్న తన్ను చూపులతో నగ్న పరుస్తున్న రాజశిల్పి స్కందనాగుని మీద ఆమె చూపులు లగ్నమైనాయి. నాట్యాంతమందు మహారాణి తన బహుమానంగా ఆమెనొక ముద్దు పెట్టుకున్నది. (ఆ తరువాత అంతఃపురంలో రాణిగారిని గట్టిగా ముద్దెట్టుకున్నారు రాజుగారు)

మంత్రిగారామెను కామించారు. దళవాయి తన్ను వివాహం చేసుకోమని బలవంతపెట్టేడు. వారి కోరికలు నిరాకరించిందామె. విశాఖదత్తుడు తనపై వ్రాసిన పద్యాలను మాత్రం స్వీకరించింది. మంత్రి, దళవాయి ఆమెపై పగబూని వున్నారు. వాళ్ళు పూనుకొని పుణ్యం కట్టుకోవడం వల్ల స్కందనాగుని ఉద్యోగం వూడిపోయింది. అయితే హాయిగా ఆమె ప్రేమ సామ్రాజ్యాన్నేలుతున్నాడాయనే. ఆమె గర్భవతి అయిందని తెలుసుకుని వారిద్దరికి వివాహం జరిపించదలుచుకున్నాడు ఆమె తండ్రి. అంతలో ఒకనాడు మంత్రి, దళవాయి కలిసి కుట్రచేసి అర్థరాత్రి నిద్రా భద్రితమైన ఆమెను రహస్యంగా తమ మనుషుల చేత హోసీమకు తరలించి అక్కడ దళవాయికి బంధువైన మన్నారయ్య అనే ఒక వృద్ధ విధుర మానవునికి బలవంతంగా కట్టబెట్టి పెళ్ళి జరిపించారు. ఆ రాత్రి శిల్పాచార్యుని ఇల్లు తగలబెట్టించారు. ఆయన మంటలలో చిక్కుకుని మరణించాడు. ఆమె కూడా మరణించిందనే వదంతి లేవదీశారు. స్కందనాగుడు విరక్తుడై తీర్థయాత్రలు సేవిస్తున్నాడు.

ఒకనాడు అనుకోకుండా హఠాత్తుగా మన్నారుగుడి గ్రామంలో ఒక ఇంటిలో వంకనున్న చంటిపాపను ముద్దు పెట్టుకుంటున్న జయంతసేనను చూశాడు స్కందనాగుడు. ఒక వంక తనవైపు కోరచూపులు ప్రసరిస్తున్నదామె. ఆమెను పలుకరిద్దామని సమీపించేసరికి ఒక వృద్ధుడు వచ్చి ఆమెను లోపలికి తీసుకుపోయాడు. ఆ ఇంటి ముంగిటికి పలుతడవలు వచ్చాడు స్కందనాగుడు. వేసిన తలుపులు మూసుకునే వుంటున్నాయి. వేచివేచి వేసారిపోయాడు. ముసిముసి నవ్వులు నవ్వుతున్న పసిపాపను ముద్దుపెట్టుకుంటూ తన్ను ఓరగా చూస్తూవున్న ఆ చిన్నారి తల్లి జయంతిసేన మనోజ్ఞమూర్తి అతడి హృదయానికి హత్తుకుపోయింది. వెర్రివాడిలా వెనుదిరిగిపోయాడు.

మన్నారుగుడికి సమీపాన దక్షిణ ద్వారక అను పేరుతో అలరారుతూ వున్న చంపకారణ్యంలో ఒక వివిక్త ప్రదేశంలో హరిద్రా నదీతీరంలో అతడొక మహత్తర శిల్ప సృష్టికి మహా సంకల్పం చేశాడు. అతని కించుక దూరంలో తంజావూరి శిల్పులు పనిచేస్తున్నారు. వారి ఉలి చప్పుళ్ళు మన్నారుగుడి నేలమాన్యాలలో ప్రతిధ్వనిస్తున్నాయి కాని స్కందనాగుని చెవిని పడలేదు. కొన్నాళ్ళక్కడ ఒక సమగ్ర మనోజ్ఞమైన శిల్పకళా సరభితమైన ఒక శిలా విగ్రహం వెలసింది. ముద్దుబిడ్డ ముఖబింబాన్ని చుంబిస్తూ వున్న ఒక లోకోత్తర సుందర స్త్రీ మూర్తి. ఆ శిల్పంలో చిత్రమేమంటే చూచేవారికామె చూపులు తమ వంక, బిడ్డ వంక సమానంగా ప్రసరిస్తున్నట్టనిపిస్తాయి. ఇది యొక జీవుడి విగ్రహం. ప్రతిష్ఠలేని విగ్రహం. అందులో ప్రాణకళ ప్రతిష్ఠించి ప్రతి ప్రేక్షక హృదయాన్నీ దానికొక మందిరంగా చేశాడా మహాశిల్పి.

అనుకున్న తీరులో ఆ విగ్రహం పూర్తి అయేసరికి తన జన్మ తరించిపోయినట్టుగా భావించాడు స్కందనాగుడు. ఇక లోకంలో తన కొక్క కోరిక మిగిలివున్నది. తగిన వ్యక్తి ఒకరు దానిని చూసి మెచ్చుకుంటే చాలు, తన కృషికది కృతార్థతగా సంభావించి హాయిగా కళ్ళు మూయాలనుకున్నాడు. ఆ అర్హత జయంతసేనకే వుందని, తన కోరికను కాదనలేరనే కొండంత ఆశతో మన్నారుగుడి ఊళ్ళోకి బయలుదేరాడు. కాని పాపం ఇతడూరు చేరుకునేసరికే ఆమె ఏ అప్సరలోకానికో మళ్ళిపోయింది. వీధి చావడిలో పరామర్శ చేయవచ్చిన వారితో ఆమె గుణగణాలను తన స్తోత్ర పాఠాలతో గుణకారం చేస్తున్నాడు మాగధ శిఖామణి మన్నారయ్య.

మతిపోయిన స్కందనాగుడు మళ్ళా ఆ విగ్రహం దగ్గరికి వెళ్ళడానికి మనస్కరించక రాజమన్నారు దేవళం సమీపంలో పిచ్చివాడిలా తిరుగుతూ రోజులు వెళ్ళబుచ్చుతున్నాడు. అలా వారాలు, మాసాలు దొర్లిపోతున్నాయి. రాజగోపాలస్వామి ఆలయానికి వచ్చిపోయే జనం ఆబాలగోపాలమూ తన శిల్పం గురించి చాలా గొప్పగా చెప్పుకోవడం విన్నాడు. ఉప్పొంగిపోయాడు. అది మన్నారయ్య భార్యదని కూడా అందరూ గుర్తించినట్టు గ్రహించాడు. అయితే అందులో ఒక అపశ్రుతి వినిపించి అతని మనస్సు చివుక్కుమన్నది. ఆ విగ్రహాన్నెవరో విరగొట్టేరని విన్నాడు. మళ్ళా పోవడానికి మతిలేదాయె. శోకశక్తి మాత్రం కావలసినంత వున్నది. ఆ శోకాగ్నిలో అతని గుండె గుగ్గిలమైపోయింది. ఆ ఘోరం మన్నారయ్య చేసిందేనని నిశ్చయించుకున్నాడు. అతని ఊహలప్పుడే మన్నారయ్య ప్రాణాల్ని తోడేస్తున్నాయి. సుత్తి తీసుకుని బయలుదేరాడు. మన్నారయ్య ఇంటి దగ్గర లేడు. హతాశుడై తిన్నగా చంపకారణ్యం వేపు నడిచాడు.

అక్కడ విరిగిన విగ్రహం మీద హరిద్రా తరంగిణీ ప్రసూతములైన పవనాంకురాలు రాలిపడిన చంపక ప్రసూనాలతో ఆ పరిసరమంతా వరదేవత మందిరంలా ఒక్కొక్క కాంచనకోరక్క మా సౌందర్య దేవతకెత్తిన ఒక్కొక్క దీప కళికలా రాణిస్తూ వున్నాయి. ఆ విగ్రహాన్నెవరో బలవంతంగా పాడుచేసినట్టు కాళ్ళు, వ్రేళ్ళు, ముక్కు, చెవి పెచ్చులూడిపోయాయి. ఆ విగ్రహ భంగిమను, అందాన్ని అచ్చుబోసిన వామపాదం మోకాలిదాక తెగిపోయి విధురంగా, వికారంగా వున్నది. అయితే తల్లీబిడ్డల తనువులు వేరుపడలేదు. ఆ ముద్దులమూట, గట్టి చుంబన ముద్ర ఆ సాకూత మనోజ్ఞమైన ఆ కేకరాక్షులూ అలాగే వున్నాయి. ఆ విగ్రహమింకా మనసులో కూడా చూడగలవారి చూపులను హరిస్తూనే వుంది.



ఆ విగ్రహ సన్నిధానంలో ఒక చంపక వృక్షచ్ఛాయలో చేతిలో పువ్వులు పట్టుకుని పూజారిలా కూచునివున్నాడు మన్నారయ్య. అతని చేతిలో ఏదో శ్రీ తాళపత్రం వున్నది. దానివేపు చూస్తూ కూనిరాగం తీస్తూ ఏదో చదువుతూ వున్నాడతడు. విధుర విగ్రహము నెదుట

మధుర గీతి. స్కందనాగుడతనిని సమీపించాడు. అదేమి టని ప్రశ్నించాడు. "ఇది మధురానగర మహాకవి విశాఖ దత్తుని కృతి. నువ్వు చూడవలసిందే" అంటూ ఆ పత్రం అతని చేతిలో పెట్టేడు ఆ కృతి.



స్కంధనాగుడతనిని సమీపించాడు.

"నిన్ను చంపినా పాపం లేదు" అని సుత్తి తీశాడు.

"చంపు. నన్ను చంపితే నీకు పాపం వస్తుందో రాదో చెప్పలేనుకాని లోకానికి మాత్రం లోటురాదు. చావడం చేతగాకే ఇలా మొరడులా బతికి వున్నాను. నాకు రాకుండా ఆ మాయదారి చావు దానికి వచ్చింది" అని కన్నీరొత్తుకుని "ఇదిగో ఈ గ్రంథాన్ని మాత్రం భద్ర పరుచు. ఇది నీది! విశాఖదత్తుని మహాకావ్యం. పాపం ఆయనా నీ కోవలోని మనిషే. మహానుభావుడు" అని మనసు దోసిట్లో పెట్టి గ్రంథాన్నందించాడు మన్నారయ్య.

అందుకున్నాడు స్కందనాగుడు. గ్రంథం పేరు "జయంతసేన".

అందులో అప్పుడే మన్నారయ్య చదివిన పద్య మేమిటా అని పరిశీలించాడు.

"కన్ను కాదు నా యెద కాన్పు.
కవిత సాక్షి
వలచితిని, విఫలుడనైతి, చింత లేదు -
నీ వలచిన, నివ్వలచిన తావుగాక
చిక్కితి వదెక్కడో అదే చింత నాకు"

పద్యం చదివి ఒక వేడి నిట్టూర్పు విడిచాడు.

పాపం 'అదెక్కడో' అని చింతించాడు మహాకవి.. అది అలా దౌర్భాగ్యుడైన మన్నారయ్య కొంపే అని ఆయనకేం తెలుసు?" అని మళ్ళా కన్నీరు నింపాడు మన్నారయ్య.

చేతిలోని సుత్తిని జారిన గుండెలా విడిచి నది వేపు చరచరా నడుస్తున్నాడు స్కందనాగుడు. అతడేదో అఘాయిత్యం తలపెట్టేడని వెంటబడ్డాడు మన్నారయ్య.

అతడు నదిలో సుడిగుండా లెక్కువగా వున్న తావుకు చేరి ఇక దూకబోతున్నాడు, మన్నారయ్య చేయి పట్టుకున్నాడు.

"చచ్చి ఏమి సాధిస్తావు?"

"బతికి ఏమి సాధించాలి గనుక. నా జయంతసేన నాకు దక్కలేదు. కనీసం నా చేతితో నేను నిర్మించు కున్న ఆమె విగ్రహమైనా నాకు దక్కింది కాదు. విగ్రహం పూర్తి అయినప్పుడే ఈ పని చేసి వుండవల సింది. విధి నెత్తిని మొత్తి ఈ వికారం నా కళ్ళతోనే నేను చూసుకోవాలని సంకల్పించింది. చూసుకుని ఇంకా ఎలా బతకను. విగ్రహ రూపంలో కూడా నా జయంతసేన వికారంగా వుండడం నేను సహించలేను. మళ్ళా మరో విగ్రహం నిర్మించే శక్తి ఉడిగిపోయింది. నా హృదయేశ్వ రిని హరించి హాయిగా చావడానికి కూడా అనుమతి ఇవ్వవా మన్నారయ్యా" అని చేతులు జోడించాడు స్కందనాగుడు.

మన్నారయ్యకేమనడానికీ పాలుపోలేదు. కాని కంట తడిపెట్టించిన శోకమే అతని కంఠానికి కొంత శక్తి ప్రసాదించింది. "జయంతసేన పోయినప్పుడు కూడా నేను కంటతడి పెట్టలేదు. నిజానికామె వేదనా విముక్తి కొక మార్గమేర్పడిందని సంతోషించాను కాని మరేవరో నాకు తెలీదు. నేను కావాలని ఈ పెళ్ళి చేసుకోలేదు. అదంతా నీ బతుకు చదరంగంలో విధి వేసిన ఎత్తు. నన్నొక పావుగా వినియోగించుకున్నాడంతే. నీ మనసు కుదుట పడడం కోసం నేను చేయని తప్పుకు క్షమాపణ వేడుకుంటున్నాను. క్షమించు. నువ్వేదో మహాశిల్పివని కాదు నీ మీద నా గౌరవం. నా జయంత సేన ప్రియుడివని. రచించగలిగితే ఆమె కలవరింతలన్నీ చక్కని కావ్య కళాఖండాలవుతాయి. ఆ ఖండ కళా సామ్రాజ్యాని కధినేతవైన నిన్ను చూడగలిగాననే ఒక తృప్తి నాకున్నది" అని చెబుతున్న మన్నారయ్య ఆర్ద్ర నయనాలలోకి తన నిద్రా దరిద్రాణ నిమీలితలోచ నాలతో దీనంగా చూశాడు స్కందనాగుడు.

"నిన్ను చంపాలనుకున్న పాపానికి నిష్కృతిగానైనా నన్ను చావనివ్వు మన్నారయ్యా" అని ప్రాధేయపడ్డాడు. మరి నివారించడానికి గత్యంతరం కనిపించలేదు మన్నారయ్యకు.

"మరి నీ బిడ్డ నొకసారి కళ్ళారా చూసుకోవా?" అన్నాడు.

"నా బిడ్డను నాకిస్తావా మన్నారయ్యా" అని ఆశతో.

ఒక మాతహావేశంతో మన్నారయ్య చూపేశాడు స్కందనాగుడు.

"ఇస్తాను. ఎందుకివ్వను. విశాఖనాగుడు నీ సొత్తు."

"విశాఖనాగు నా!" అని విస్తుపోయాడు శిల్పి.

"అవును. ఆమె చేసుకున్న నామకరణమే. అన్నట్టు ఈ కావ్యం నీ కంకితమైనదనే విషయం గుర్తించావు కదూ" అని మళ్ళీ "మరి నీ బిడ్డను కూడా నీలాగ ఒక మహాశిల్పిని చేసి నీ జన్మ సార్థకం చేసుకో" అని హెచ్చరించాడు మన్నారయ్య.

దూరంగా రాజగోపాలస్వామి గుడిలో గంట మ్రోగింది. హరిద్రానది మంచి హాయిగా చల్లగాలి వీచింది. చంపకవనం కంపనం పొందింది. విరిసిన పువ్వులు జలజలా రాలేయి. పరిసరమంతా పరమ సురభితమైనది. ●